తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం....

హైదరాబాద్
బుధవారం
19 నవంబర్ 2025
సంపుటి 92
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00

నిజామాబాద్ సంపుటి : 12 సంచిక : 239 పేజీలు : 8 ఎడిటర్ : పానుగంటి శ్రీనివాస్ బుధవారం 19 నవంబర్ 2025 వెల : 2/-



## శబరిమలకు పోటెత్తిన భక్తులు..

- సౌకర్యాల లేమితో స్వాములకు తీవ్ర ఇబ్బందులు

- శబరిమలలో మొదలైన మండల పూజల రద్దీ
- ఏర్పాట్లు సరిపోక స్వాములకు తీవ్ర ఇబ్బందులు
- దర్శనానికి 15 గంటల నిరీక్షణ.. కుప్పకూలుతున్న యాత్రికులు
- సౌకర్యాలు సరిపోవడం లేదని అంగీకరించినదేవస్థానం బోర్డు అధ్యక్షుడు
- గత ఏడాది నాటి సంక్షోభం పునరావృత మవుతుందన్న ఆందోళన

☞ 2

# నేటి నుండి ఇందిరమ్మ చీరల పంపిణీ

- రెండు దశల్లో కోటి మంది మహిళలకు చీరల పంపిణీ
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర
- నేటి నుండి నుంచి డిసెంబరు 9 వరకు తొలిదశ పంపిణి
- మార్చి 1 నుంచి మార్చి 8 వరకు 2వ దశ పంపిణి



తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ కోసం చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు త-యారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. తొలి దశలో ఇందిరా గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని చెప్పారు. సాంకేతికను...

☞ 2

## ఏసీబీ అధికారులను చూసి పొలాల్లోకి పరుగెత్తిన ఎస్సై

- మెదక్ జిల్లా టేక్మల్‌లో ఘటన
- ఒక కేసులో రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా ఘటన
- వెంబడించి పట్టుకుని విచారణ జరుపుతున్న ఏసీబీ అధికారులు
- టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్న గ్రామస్థులు



తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లాలోని టేక్మల్‌లో ఒక ఎస్సై లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కడంతో పొలాల్లోకి పారిపోయాడు. ఒక కేసు విషయంలో ఎస్సై రాజేశ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఏసీబీ అధికారులను చూడగానే ఆందోళనకు గురైన ఎస్సై పక్కనే ఉన్న పొలాల్లోకి పరుగు తీశాడు. ఏసీబీ అధికారులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం, అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి



విచారణ చేస్తున్నారు. ఎస్సై రాజేశ్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటంతో గ్రామస్థులు పోలీస్ స్టేషన్ ఎదుటట పాసులు కాల్చి సంబరాలు జరుపుతున్నారు.



ఐబొమ్మ రవి కేసులో

## ఈడీ రంగప్రవేశం..


- ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ. 15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ. 3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

## విజయవాడలో మావోయిస్టుల కలకలం..

- ఒకే భవనంలో 27 మంది నక్సల్స్ అరెస్ట్

- విజయవాడ శివార్లలో మావోయిస్టుల స్థావరం గుర్తింపు
- కేంద్ర, రాష్ట్ర బలగాల జాయింట్ ఆపరేషన్‌లో 27 మంది అరెస్ట్
- అరెస్టయిన వారిలో 12 మంది మహిళలు, నలుగురు కీలక నేతలు
- కూలీల వేషంలో నగరంలోకి ప్రవేశించి భవనాన్ని అద్దెకు తీసుకున్న మావోలు



తరంగాలు, డెస్క్, నవంబర్ 18 విజయవాడ నగర శివార్లలో మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపాయి. అత్యంత పకడ్బందీగా అందిన సమాచారంతో కేంద్ర, రాష్ట్ర బలగాలు సంయుక్తంగా చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 27 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. కానూరు కొత్త ఆటోనగర్ ప్రాంతంలోని ఓ భవనాన్ని షెల్టర్‌గా మార్చుకుని కార్యకలాపాలు సాగిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో కేంద్ర బలగాలతో పాటు ఆక్టోపస్, గ్రేహౌండ్స్ దళాలు పాల్గొన్నాయి. పోలీసు వర్గాల కథనం ప్రకారం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఈ మావోయిస్టుల బృందం సుమారు పది రోజుల క్రితం విజయవాడకు చేరుకుంది. తాము కూలీ పనుల కోసం వచ్చామని స్థానికులను నమ్మించి, ఆటోనగర్‌లోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. అయితే, వీరి కదలికలపై అనుమానం రావడంతో నిఘా వర్గాలు..

మిగతా 2 లో..

## అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి

- మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
- అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులంటూ ఫైర్

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 మావోయిస్టులు అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయన వేములవాడ ఏరియా ....



మిగతా 2 లో..

## ఉపఎన్నికతో ఒక పార్టీ నాలుగు ముక్కలైంది

- మంత్రి కోమటిరెడ్డి



- రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ పాలనేనన్న కోమటిరెడ్డి
- మరో పార్టీ డిపాజిట్ కోల్పోయి అడ్రస్ లేకుండా పోయిందన్న మంత్రి
- మిర్యాలగూడలో రూ.74 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : రాష్ట్రంలో మరో 15 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, ప్రజల మద్దతు తమకే ఉందని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో ఒక పార్టీ నాలుగు ముక్కలైందని, మరో పార్టీ డిపాజిట్ కోల్పోయి ప్రజల్లో కనపడకుండా పోయిందని ఆయన పరోక్షంగా బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి విమర్శించారు. ఒకే కుటుంబంలోని తండ్రి, కుమార్తె, కుమారుడు, అల్లుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని ....

2

## ఢిల్లీ పేలుళ్ల కేసులో కీలక పురోగతి..

### కారు బాంబు తయారు చేసిన నిందితుడి

- కారు బాంబు తయారు చేసిన జసీర్ బిలాల్ వాని అరెస్ట్
- అనంతనాగ్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ
- ఆత్మాహుతి బాంబర్‌కు బాంబు ఇచ్చింది ఇతడేనని వెల్లడి

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మరో కీలక పురోగతి సాధించింది. ఈ కేసుకు సంబంధించి కారు బాంబును తయారు చేసిన కీలక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. అనంతనాగ్‌లో జసీర్ బిలాల్ వాని అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఆత్మాహుతి బాంబర్ ఉ



మర్‌కు కారు బాంబును అందించింది బిలాలేనని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, డ్రోన్లు, రాకెట్ల ద్వారా ...

2

# నేటి నుండి ఇందిరమ్మ చీరల పంపిణీ





మొదటి పేజీ తరువాయి..
వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని చెప్పారు.

# అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి

## - మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు

మొదటి పేజీ తరువాయి..
ఆసుపత్రికి రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మావోయిస్టులు అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. వారి మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సలైట్లు కారణమని అన్నారు. అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. నక్సలైట్లు ఇప్పటికైనా తుపాకీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని ఆయన పేర్కొన్నారు.

# విజయవాడలో మావోయిస్టుల కలకలం..

## - ఒకే భవనంలో 27 మంది నక్సల్స్ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి..
సమాచారం సేకరించాయి. దీని ఆధారంగా బలగాలు మంగళవారం తెల్లవారుజామున ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని మెరుపుదాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో 12 మంది మహిళలు, నలుగురు కీలక స్థాయి నేతలతో పాటు 11 మంది మిలీషియా సభ్యులు, సానుభూతిపరులను అరెస్ట్ చేసినట్లు అధికారులు ధృవీకరించారు. విచారణలో మావోయిస్టులు నగర శివార్లలో నాలుగు చోట్ల ఆయుధాలు, పేలుడు పదార్థాలతో కూడిన డంప్‌లను ఏర్పాటు చేసినట్లు కీలక సమాచారం లభించింది. దీంతో అప్రమత్తమైన బలగాలు ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. డంప్‌లను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు, మావోయిస్టులకు ఆశ్రయం కల్పించిన భవన యజమాని గత నెలన్నరగా విదేశాల్లో ఉన్నట్లు తేలింది. దీంతో భవన వాచ్‌మేన్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన మావోయిస్టులు.. వ్యూహం మార్చి విజయవాడ వంటి కీలక నగరంలో స్థావరం ఏర్పాటు చేసుకోవడం భద్రతా వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నగరంలో ఉంటూ తమ కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలో భాగంగానే ఇక్కడికి వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అరెస్ట్ అయిన వారిని మరింత లోతుగా విచారించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# ఉపఎన్నికతో ఒక పార్టీ నాలుగు ముక్కలైంది..

## - మంత్రి కోమటిరెడ్డి

మొదటి పేజీ తరువాయి..
ఎద్దేవా చేశారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రూ.74 కోట్లతో నిర్మించనున్న అవంతిపురం-శెట్టిపాలెం నాలుగు లైన్ల రహదారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కోమటిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.60 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ.10,410 కోట్లతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించే పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత కృషితోనే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఇదే కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# శబరిమలకుపోటెత్తిన భక్తులు..

## - సౌకర్యాల లేమితో స్వాములకు తీవ్ర ఇబ్బందులు

మొదటి పేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, నవంబర్ 18
బరిమలలో రెండు నెలల పాటు జరిగే మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ గందరగోళంతో ప్రారంభమైంది. విపరీతమైన రద్దీ, కనీస సౌకర్యాల లేమి, అధికారుల వైఫల్యంతో అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం నాడు రద్దీని నియంత్రించేందుకు దర్శన సమయాన్ని రెండు గంటల పాటు పొడిగించినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్ ద్వారా రోజుకు 90 వేల మందికి మాత్రమే దర్శనం కల్పించాలని నిర్ణయించినప్పటికీ, సోమవారం నుంచి రోజుకు లక్షకు పైగా భక్తులు వస్తుండటంతో ఏర్పాట్లు సరిపోలేదు. స్వామివారి దర్శనం కోసం భక్తులు 10 నుంచి 15 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. పవిత్రమైన 18 మెట్ల వద్ద భక్తుల ప్రవాహం గణనీయంగా మందగించడంతో, సన్నిధానం నుంచి క్యూలైన్లు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి.

త్రాగునీరు, ఆహారం అందక, గంటల తరబడి నిల్చోవడంతో చిన్నారులు, వృద్ధులు క్యూలైన్లలోనే సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఏర్పాట్లు సరిగా లేవని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు నూతన అధ్యక్షుడు కె. జయకుమార్ స్వయంగా అంగీకరించారు. త్రాగునీటి కేంద్రాలు, బయో-టాయిలెట్లు, ఆహార సరఫరాలో లోపాలున్నాయని ఆయన తెలిపారు.

రద్దీ నియంత్రణకు అవసరమైన కేంద్ర బలగాలైన ఎన్డీఆర్ఎఫ్, ఆర్ఏఎఫ్ అందుబాటులో లేకపోవడం, కేటాయించిన 18,000 మంది పోలీసులకు గాను కేవలం 3,500 మంది మాత్రమే విధుల్లో ఉండటంతో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే, గత ఏడాది (2023) నాటి సంక్షోభం పునరావృతం అవుతుందని, ఎంతోమంది భక్తులు యాత్రను మధ్యలోనే విరమించుకోవాల్సి వస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీ పేలుళ్ల కేసులో కీలక పురోగతి..

## కారు బాంబు తయారు చేసిన నిందితుడి అరెస్ట్

మొదటి పేజీ తరువాయి..
కూడా దాడులకు జసీర్ బిలాల్ కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ఇదే కేసులో ఆత్మాహుతి దాడికి కుట్ర పన్నిన అమీర్ రషీద్ అలీని ఆదివారం ఎన్ఐఏ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు అమీర్ పేరు మీదే రిజిస్టర్ అయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నవంబర్ 10న జరిగిన ఈ పేలుడు ఘటనపై ఎన్ఐఏ లోతైన దర్యాప్తు కొనసాగిస్తోంది. పేలుడు కుట్రలో పాల్గొన్న వ్యక్తులు, సంస్థలను గుర్తించే పనిలో ఉంది. ఈ కేసులో ఇప్పటివరకు 73 మంది సాక్షులను విచారించారు.




ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది.

# అమిత్ షా డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేసిన భద్రతా బలగాలు

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. విశేషమేమిటంటే, నవంబర్ 30లోపు హిడ్మాను పట్టుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన గడువుకు 12 రోజుల ముందే భద్రతా బలగాలు ఈ లక్ష్యాన్ని ఛేదించాయి. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హిడ్మా తీవ్ర గాయాలతో మరణించాడు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కీలకమైన మావోయిస్టు డాక్యుమెంట్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ పరిణామంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పందించారు. "ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టాం. నక్సలిజం నిర్మూలనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో



భాగంగానే హిడ్మా లాంటి అగ్రనేతలే లక్ష్యంగా బలగాలు ముందుకు సాగుతున్నాయి. హిడ్మా మృతితో మావోయిస్టు అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌కు కోలుకోలేని దెబ్బ తగిలినట్లయిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ విజయంతో బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేశాయి.

# పిస్తా హౌస్, షా గౌస్‌పై ఐటీ పంజా..

## - 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు

తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : హైదరాబాద్ నగరంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తుండటం కలకలం రేపుతోంది. నగరానికి చెందిన ప్రముఖ హోటల్స్ అయిన పిస్తా హౌస్, షా గౌస్ లక్ష్యంగా ఈ ఉదయం నుంచి ఈ సోదాలు జరుగుతున్నాయి. రెండు సంస్థలకు సంబంధించి ఏకకాలంలో 15 ప్రాంతాల్లో ఐటీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. వివిధ బృందాలుగా విడిపోయిన అధికారులు.. పిస్తా హౌస్, షా గౌస్ కార్యాలయాలతో పాటు వాటి ఛైర్మన్లు, డైరెక్టర్ల నివాసాల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని, వాటిని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పన్ను చెల్లింపులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలో మంచి పేరున్న ఈ రెండు హోటళ్లపై ఐటీ దాడులు జరగడం వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. తనిఖీలు పూర్తయిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# తిరుమలలో భక్తుల రద్దీ..

## -సర్వదర్శనానికి 12 గంటలు!



తరంగాలు, డెస్క్, నవంబర్ 18 : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతోంది. ప్రస్తుతం 12 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం కల్పించేందుకు సుమారు 12 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు అంచనా వేస్తున్నారు. నిన్న ఒక్కరోజే 71,208 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 23,135 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.84 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# లక్ష్మీనరసింహస్వామి గుట్ట చెట్టు గిరిప్రదక్షిణ



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 18, (తరంగాలు) : మండల కేంద్రమైన జఫర్ గడ్ లో పడమల కొండ చుట్టూ కార్తీక మాసం మంగళవారం స్వాతి నక్షత్రంలో వివిధ గ్రామాలకు చెందిన 50 మంది భక్తులు గిరి ప్రదక్షణ చేసారు. జఫర్గడ్ పడమర కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి సతీసమేతుడై వెలసియున్నాడు.కాగా గత కొద్ది నెలలుగా లక్ష్మీనరసింహస్వామి గుట్ట చుట్టూ గిరి పరీక్ష కార్యక్రమాన్ని భక్తుడు నిర్వహిస్తున్నారు. రోజురోజుకు స్వాతి నక్షత్రంలో గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు ప్రతి నెల వచ్చేటువంటి స్వాతి నక్షత్రం రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు,ఈ కార్యక్రమానికి విచ్చేసే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఉంటే కాకుండా కార్తీకమాసం మంగళవారం రోజున జతరగడ మండల కేంద్రంలోని పాతూరులో గల బైరాగి ఆంజనేయ స్వామికి భక్తులు చందనం వేయించడం జరిగిందని అర్చకులు వెంకన్నచార్యులు తెలిపారు ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ గిరిప్రదక్షిణ చేసే భక్తులకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం గుట్ట చుట్టూ రహదారి నిర్మించాలని భక్తులు కోరారు.

# అంగన్వాడి సెంటర్లకు శాశ్వత పరిష్కారం కావాలి





జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 18, (తరంగాలు) : మండలం లోని కూనూర్ గ్రామం లో అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు అయ్యి కూడా స్థలం లేక పోవడం తో అంగన్వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పిల్లలకు గర్భిణీ స్త్రీలను బాలింతల కి పౌష్టిక ఆహారం అందించి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా చూస్తున్న అంగన్వాడీ కేంద్రం కి స్థలం ఇవ్వాలి అని గ్రామ పంచాయతీ కార్యదర్శి కి సమస్య ను వివరించడం జరిగింది. దాని కి పంచాయతీ కార్యదర్శి గ్రామ సభ రోజున చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది అదే విధంగా గ్రామస్తులు కూడా తీర్మానం చేసుకొని రావాలి అని వారు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో యస్ సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య బిజెపి నాయకులు ముచ్చ యాదవ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలి

- **బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



నల్లబెల్లి, నవంబర్ 18: తరంగాలు : రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానంలో పోటీ చేయడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల బిజెపి పార్టీ కార్యాలయంలో బూత్ అధ్యక్షుల సమావేశం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలని, అధిక స్థానాలు గెలుచుకునేందుకు ముందస్తు వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధుల వివరాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెరుమాండ్ల కోటి, నాగిరెడ్డి రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఈర్ల నాగరాజు, గుగులోతు తిరుపతి, ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, గుర్రపు నరేష్, సింగిరెడ్డి యాదగిరి, భూక్యా మైభూ, కార్యదర్శులు మర్రి నాగరాజు, బూర కృష్ణ, పున్నం కృష్ణమూర్తి, కోశాధికారి మురికి మనోహర్‌తో పాటు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత

- **యువత వివిధ పోటీల్లో పాల్గొని జిల్లా ప్రతిభను ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగాలి**
- **యువజన ఉత్సవాలను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**





భూపాలపల్లి, నవంబర్ 18,తరంగాలు : యువజన ఉత్సవాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నాయకత్వ గుణాలను వెలికితీయడంలో దోహదపడతాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఇల్లంద క్లబ్ లో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో స్థానిక శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తో కలసి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యువత వివిధ పోటీల్లో పాల్గొని జిల్లా ప్రతిభను ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జాతీయ యువజనోత్సవం సందర్భంగా యువత తమలోని ప్రతిభను ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. యువత స్వామి వివేకానంద ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యువతులు చేసిన జానపద నృత్యాలు అలరింపజేశాయి. అనంతరం మాదక ద్రవ్యాల నివారణ, అవగాహనపై ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా యువజన మరియు క్రీడా అధికారి సి హెచ్ రఘు, ఇతర అధికారులు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధికి యువతే పునాది







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18,తరంగాలు : స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం, మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో నషా ముక్త భారత్ అభియాన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సమాజానికి, విద్యార్థుల భవిష్యత్తుకు కలిగే ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉమన్ డెవలప్మెంట్ అధికారి సులోచన హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉంది. మాదకద్రవ్యాలు మన జీవితాన్ని నాశనం చేస్తాయి. మనం మాత్రమే కాదు, మన కుటుంబం, సమాజం కోసం కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి" అని పేర్కొన్నారు.డా. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం కళాశాల ఇలాంటి కార్యక్రమాలు వారి ఆలోచనా శక్తిని మెరుగుపరుస్తాయి అని బాధ్యతతో జీవించేందుకు ఎంతగానో దోహదపడతాయి అని ఇంజనీరింగ్ విద్యార్థులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోసిస్తున్నారని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి 'నో' చెప్పటం ద్వారా సమాజంలో ఉన్నత మార్పులకు శ్రీ కారం చుట్టినవాళ్ళు అవుతారని అన్నారు. యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పడేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిపుణులచే డ్రగ్ మానసిక-శారీరక ప్రభావాలు, నివారణ చర్యలు, సహాయం పొందే మార్గాలు గురించి ప్రత్యేక సెషన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులందరూ నషా ముక్త భారత్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. వి. సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్‌ఛార్జి కృష్ణ ప్రసాద్, విభాగాధిపతులు డా. ప్రణతి, డా. జ్యోతి, డా. చార్యులు తదితరుల తో పాటు స్త్రీ శిషు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు సావిత్రి, రమాదేవి, ఉమా ,సువర్చల, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు మిగిలాయి..

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.18 తరంగాలు : కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. మంగళవారం నాడు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ను ఆయన స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాక రేవంత్ రెడ్డి మాయ మాటలు చెప్పి బోనస్ ఇస్తానని యాసంగి పంటకు బోనస్ ఇవ్వకపోవడంతో రైతులు దళారులకు పండించిన వడ్లు మొక్కలను అమ్ముతున్నారని తీవ్రంగా రైతులు క్వింటాకు 400 రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియా బస్తాలు అందకపోవడంతో బ్లాక్లో 1500 లకు ఒక యూరియా బస్తా చొప్పున మూడు సంచులను కొనాల్సి వచ్చిందని రైతులు స్వయంగా చెప్పారని, వరంగల్ తర్వాత అతిపెద్ద మార్కెట్ కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నీటికి వరకు కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడం ఏంటని, రైతులు పండించిన వడ్లు దళారుల పాలవుతున్నాయని ప్రభుత్వం మద్దతు ధరకు కొని ఉంటే క్వింటాకు 2800 రావలసి ఉండని, సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్ వదిలి వ్యవసాయం మార్కెట్ కు రండి అని సవాల్ విసిరారు. ఇక్కడ రైతులు కన్నీళ్లు మీకు అర్థమవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం లేక దళారులకు ధాన్యాన్ని రైతులు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్లో 10 రోజులైనా కూడా మక్కలను కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు చేసిన మక్కలకు 15 రోజులైనా డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, వ్యవసాయ మార్కెట్లో కనీస సౌకర్యాలు లేవని వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని పత్తి రైతుల కోసం ప్రతిపక్షం కదిలేనంక ని ప్రభుత్వానికి చలనం వచ్చిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హడావుడిగా జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో సమావేశం పెట్టి సమస్యను పరిష్కరించి పత్తి కొంటామని వెంటనే చెప్పారని ప్రతిపక్షమైన బిఆర్ఎస్ కదులుతే తప్ప కాంగ్రెస్ కి కదలిక లేదని, టిఆర్ఎస్ కొట్లాడింది కాబట్టే జూబ్లీహిల్స్ ఎన్నిక ముందు మైనార్టీకి మంత్రి పదవి ఇచ్చారని వరదల వలన జిల్లాలో అనేక రోడ్లు తెగిపోయాయని మహబూబాబాద్ సీతారామ తండాలో కొత్త ఇల్లు కట్టిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాడని ఇప్పటివరకు ఒక ఇల్లు కూడా కట్టలేదని ఎదవ చేశారు తెగిపోయిన రోడ్లకు మరమ్మత్తులు చేయలేదు కనీసం తట్టెడు మట్టి కూడా పోయెని వైనం గా మారిందని మహబూబాబాద్ జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇసుక మాఫియాకి తెగబడ్డారని బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 1000 రూపాయలకు టన్ను ఇసుక ఉంటే నేడు 3000కు టన్ను కాంగ్రెస్ పెంచిందని అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటకు ఎకరానికి 10000 ఇస్తానని వరంగల్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాడని పంటల భీమా అమలు చేస్తామన్న వరంగల్ డిక్లరేషన్ హామీ ఏమైంది అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రజానాయక్ కోరినందుకు మహబూబాబాద్ లో వంద పడకల





ఆసుపత్రిని బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేస్తే కాంగ్రెస్ పాలనలో వాటి పురోగతి లేదని, డోర్నకల్ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం సీఎం కొబ్బరికాయ కొట్టారని ఇప్పటివరకు ఇటుక పెట్టినది లేదని మట్టి తవ్వింది లేదనీ, టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి కింద ఇక్కడ పాఠశాలలను డీజిటల్ పాఠశాలగా మార్చామని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో 67,000 మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో తగ్గారని వైద్యం అటుకెక్కిందని రైతులకు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుంతలు లేని రోడ్డు లేదని, మల్యాల లో వెంటనే హార్టికల్చర్ కాలేజీ పనులను ప్రారంభించాలని హార్టికల్చర్ కాలేజీని తరలించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీలకు మంత్రి పదవి లేదని డిప్యూటీ స్పీకర్ పదవి లేదని అసెంబ్లీ పెట్టే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి లేదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయి ఏమోనని అసెంబ్లీ పెట్టకుండా ఉంటున్నారని, వెంటనే డిప్యూటీ సీఎం ఎన్నిక చేయాలని అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రివర్గ స్థానంలో గిరిజనులకు లంబాడీలకు స్థానం కల్పించాలని కెసిఆర్ హయాంలో బంజారాహిల్స్ లో బంజారా భవన్ కొమరం భీమ్ భవన్ కట్టించి గిరిజనులను లంబాడీలను గౌరవించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వద్దిరాజు రవిచంద్ర,తక్కెళ్లపల్లి రవీందర్ రావు,సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్,మాలోత్ కవిత, బానోత్ శంకర్ నాయక్, రాకేష్ రెడ్డి, నీలం దుర్గేష్,శ్రీనాథ్ రెడ్డి,ఊకంటి యాకూబ్ రెడ్డి, రావుల రవిచంద్ర రెడ్డి, నజీర్ అహ్మద్, కముటం శ్రీను, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, ఘనపారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలి

- మహిళలకు రూ.2500/లు రూపాయలు ఇవ్వాలి
- జల్లె జయరాజు సిపిఎం పార్టీ మండల నాయకులు



కేసముద్రం, నవంబర్.18, తరంగాలు : మంగళవారం రోజున కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి ముద్రకోల శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశానికి జల్లే జయరాజు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. గ్యాస్ 500 రూపాయలకే అన్నారు కానీ 900ల వరకు గ్యాస్ ఏజెన్సీ వాళ్ళు వసూలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ నుండి సబ్సిడీ పడతలేదని అన్నారు. రాష్ట్రంలో వికలాంగులు ,వితంతువులు, వృద్ధులు అనేకమంది పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని అర్హులైన వారందరికీ తక్షణమే పెన్షన్లు ఇవ్వాలని. పెన్షన్లు తీసుకునే వాళ్లకు పెన్షన్లు పెంచుతామని చెప్పి పాత పద్ధతిలోనే పెన్షన్లు ఇస్తున్నారని తక్షణమే రెండు వేల16 రూపాయలను నాలుగు వేల 16 రూపాయలకు, 4016. రూపాయల నుంచి 6016 రూపాయలకు పెంచాలని అన్నారు. అదేవిధంగా అర్హులైన మహిళలందరికీ నెలకు రూ. 2500 రూ- పాయలు చెల్లించాలని, ఇందిరమ్మ సెకండ్ విడుతలో అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలని ఇల్లు నిర్మించిన వారికి తక్షణమే బిల్లులు చెల్లించాలని, ఎస్సీలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయాసం పథకం ద్వారా అర్హులైన వారందరికీ రూ .12 లక్షల రూపాయలు ఇవ్వాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శాఖ సభ్యులు పుట్ట ముత్తయ్య కదరే రాజు సోమారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిరోదానికి యువత సంకల్పం తీసుకోవాలి







మధిర, నవంబర్ 18, తరంగాలు : నష ముక్త్ భారత్ అభియాన్ ను ఏర్పడి ఐదు సంవత్సరాలు అయినా సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధిర నందు మహిళ శిశు సంక్షమశాఖ మధిర వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్య మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అటువంటి వ్యక్తులు తారసపడితే వారిని మంచి మార్గంలో నడిపించటానికి ప్రయత్నం చేయాలనీ కోరారు మరొక అతిధి కళాశాల అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీ మాధవరపు నాగేశ్వరరావు రిటైర్డ్ ఎంపీడీఓ మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన సామజికంగా ఆర్థికంగా ఆరోగ్య పరంగా నష్టం జరుగుతున్నదని తెలిపారు. ఐసీడీస్ నుండి గుడపాటి కృష్ణ మాట్లాడుతూ యువత దేశానికి చాలా అవసరం అని కావున చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు కొనసాగాలని కోరారు షేర్ సేవా సంస్థ కౌన్సిలర్ హనుమంతరావు మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు పడిన వారిని గుర్తించే లక్షణాలను గురించి తెలిపారు. అనంతరం విద్యారులచే ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు షేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 19న హైదరాబాద్ లో జరిగే కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి

- సభను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్. 18, తరంగాలు : సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత విప్లవోద్యమ నిర్మాత, ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభ సందర్భంగా కామ్రేడ్ సిపి రెడ్డి రాసినఏరిన రచనలుఅనే పుస్తకా ఆవిష్కరణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని స్థానిక కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు బట్టు నాగేశ్వరరావు అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్ల నాయకులు శివారపు శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి భారత విప్లవోద్యమంలో చేసిన కృషి గొప్పదని,ఈ దేశ చరిత్రలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేయటంలో చెరగని ముద్ర వేశారని అన్నారు.ఈ వ్యవస్థ మార్పు కోసం భారత విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడానికి ప్రపంచంలో వివిధ దేశాల పోరాట చరిత్రలను అధ్యయనం చేసి,రచనలు చేసి ప్రతిఘటన పోరాట రూపశిల్పిగా,మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతకర్తగా పేరు ప్రఖ్యాతలు పొందాడన్నారు. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయటానికి కామ్రేడ్ సి పి రెడ్డి తన కాలమంతా కృషి చేశాడు. ఆయన నుండి మనం నేర్చుకోవాలి.ఆయన ప్రబోధించిన లోతైన సిద్ధాంత అవగాహనను ఆయన సం- -సోపేతమైన ఆచరణ మనం నేర్చుకోవాలి. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ప్రతిఘటన పోరాట రూపశిల్పి,గొప్ప విజ్ఞానవేత్త, మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతకర్త ప్రజల్ని ఆకట్టుకునే మంచి రచయిత, ఉద్యమ నిర్మాత, దేశమంతా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మహా విప్లవోద్యమ నేత సిద్ధాంతం, ఆచరణ, క్యాడర్, లీడర్ అన్ని మేళవించుకున్న గొప్ప మేధావి కామ్రేడ్ పుల్లారెడ్డి అని అన్నారు. దేశంలో (ఎం-ఎల్) పార్టీలను ఐక్యం చేయడానికి ఎనలేని కృషి చేస్తూ అమరత్వం చెందాడని, ఆయన ఆశయాల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కర్యక్రమం లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కమిటీ నాయకులు మనిగంటి సుధాకర్, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు మిట్టగడుపుల వెంకన్న, హమాలి యూనియన్ కేసముద్రం మండల అధ్యక్షులు బండి రాజు, మన కార్మిక సంఘం జిల్లా నాయకులు బెజ్జంకి బ్రహ్మాచారి, ఐఎఫ్టియు కేసముద్రం పట్టణ నాయకులు కే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ చాలీసా మండల పారాయణం ప్రారంభం



బూర్గంపాడు నవంబర్ 18 తరంగాలు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక లోని శ్రీ దాసాంజనే- య స్వామి వారి ఆలయంలో సాకేతపురి హనుమాన్ చాలీసా భక్త బృందం వారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా మండల పారాయణం అంగరంగ వైభవంగా ప్రారంభించడం జరిగినది. భక్తుల రంగురంగుల పూలతో స్వామివారిని, ఆలయాన్ని అలంకరించి భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హనుమాన్ చాలీసా మండల ప్రారాయణం నవంబర్ 18 నుండి డిసెంబర్ 30 వరకు జరుగుతుందని డిసెంబర్ 30న పూర్ణాహుతితో ఈ హనుమాన్ చాలీసా మండల పారాయణం పూర్తవుతుందన్నారు, కావున భక్తులు ఎవరైనా తమ గృహములలో హనుమాన్ చాలీసా పారాయణం చేపించుకోదలచినవారు ముందుగా వెంకటేశ్వరరావు 8341394847 ఈ నెంబర్ ని సంప్రదించి ఏ రోజున హనుమాన్ చాలీసా పారాయణం చేపించుకోదల్చుకున్నారు తెలియజేయ గలరన్నారు. హనుమాన్ చాలీసా తమ గృహాలలో జరిపించుకున్న వారికి సకల శుభాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, హనుమాన్ చాలీసా భక్త బృందం సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ములుగు ఎస్సై రఘుపతిని కలిసిన బిజెపి నాయకులు



తరంగాలు, గజ్వేల్ నవంబర్ 18 : గజ్వేల్ నియోజకవర్గం, ములుగు మండలం నూతన ఎస్సైగా నియమితులైన రఘుపతిని ములుగు మండల బిజెపి పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి భద్రతలపరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని రకాలుగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు పల్లె రమేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఇరుకుల ఆనంద్ కుమార్, మండల బీజేవైఎం అధ్యక్షుడు కిట్టు యాదవ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నక్క ప్రవీణ్ గౌడ్, బిజెపి నాయకులు బాబు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ నూతన ఎస్ఐ ని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ పత్రిక యాజమాన్యం



తరంగాలు, జగిత్యాల, నవంబర్ 18 : రూరల్ నూతన ఎస్సై ఉమాసాగర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించిన తెలంగాణ పత్రిక విలేకరులు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉమా సాగర్ మాట్లాడుతూ కలం విలువల నైపుణ్యత గౌరవనీయమని ప్రజలకు ఎల్లవేళలా పోలీస్ బృందం అందుబాటులో ఉంటామని ప్రజా రక్షణ మా పోలీస్ బాధ్యత అని ఆపదలో ఉన్నవారు 100 కి సంప్రదించి సేవలను అందుకోవాలని ఈ మధ్య కలంలో యువత డ్రాక్స్ మరియు గంజాయి కి బానిస అవుతున్నారని యువత తప్పుదోవ పట్టకుండా తమ తమ పిల్లల మరియు ఏ ఇతర సంఘ విద్రోహ కార్యక్రమలు తమ కంటికి కనబడిన నిస%శీ%దేహంగా పోలీస్ వారికీ తెలియజేయాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ పత్రిక స్టేట్ ఇంచార్జ్ కాముని శ్రీనివాస్, స్టేట్ బ్యూరో పురాణం సురేష్, ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చింత సుదీర్, జిల్లా స్టాఫర్ బోగా నాగభూషణం, టౌన్ రిపోర్టర్ సంద రాజశేఖర్, పెండరి శ్రవణ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతులు వరికి బదులు ఆరుతడి పంటల పై దృష్టి సారించాలి...

## - మండల వ్యవసాయాధికారి కె. యోగిత

తరంగాలు, కథలాపూర్ మండలం, నవంబర్ 18 : మండల కేంద్రంలోని క్షేత్ర పర్యటనలో భాగంగా తక్కలపల్లి గ్రామంలో శనగ, మిరప, మొక్కజొన్న, కూరగాయ పంటలు కాకర, బీర, దోస పంటలను మండల వ్యవసాయ అధికారి కె.యోగితా పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మొక్కజొన్న, శనగ, వేరు శనగ, పప్పుదినుసు పంటలతో పాటు, కూరగాయ పంటలను సాగు చేయటం వల్ల రైతులు అధిక లాభాలు పొందుతున్నారని వివరించారు. ఒకే పంట సాగు చేయకుండా పంటమార్పిడి చేయాలని రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఏక పంట సాగుచేయటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బ తినడం తో పాటు గా చీడపీడల సమస్యలు పెరుగుతాయి అని రైతులకు వివరించారు. ఈ



కార్యక్రమంలో ఏ ఈ వో మౌనిక, రైతులు బల్లం తిరుపతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- దళారీ వ్యవస్థను రూపుమాపేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు అబ్బిడి రాజి రెడ్డి, జిల్లా నాయకులు పోషాల వెంకన్న గౌడ్

వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 18, తరంగాలు : రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని, దళారి వ్యవస్థను పూర్తిగా రూపుమాపడం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నదని ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు అబ్బిడి రాజి రెడ్డి, జిల్లా నాయకులు పోషాల వెంకన్న గౌడ్ తో కలిసి వర్ధన్నపేట వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడి వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతును రాజుగా చూడడం...వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులెవ్వరు అధైర్య పడవద్దని, రైతు పండించిన ఆఖరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు సెంటర్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన కాంటాలు అయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మహేందర్ రావు, ఓ బి సి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాంపెల్లి యాదగిరి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు దామెర ప్రశాంత్, పోతాం మధుకర్, రాచమల్ల రాంమూర్తి, సినపెల్లి ఎల్లయ్య, షాగంటి యాకయ్య,





తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ ప్రాముఖ్యత

- సహకార సంఘాలను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోనీ ప్రజలకు జీవనోపాధి కల్పించడమే సహకార లక్ష్యం
- ఘనంగా 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు
- జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఉత్సవాల నిర్వహణ









హన్మకొండ ప్రతినిధి, నవంబర్ 18,తరంగాలు : 72 వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా హన్మకొండ జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో డీసీసీబీ బ్యాంకులో నిర్వహించిన ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ లక్ష్యమని అన్నారు. అన్నిరంగాల్లో సహకార వ్యవస్థ ప్రాముఖ్యత ఎంతో ముఖ్యమైనది. వివిధ ప్రాంతీయ ప్రాంతాలలో సహకార రంగం సాధించిన విజయాలను తెలియజేస్తూ, ప్రతి రంగంలో సహకార అభివృద్ధి యొక్క గతిశీలత ఆధారంగా అభివృద్ధి యొక్క భవిష్యత్తు వ్యూహాలను రూపొందించడం ఈ వారోత్సవాల ముఖ్య లక్ష్యం అని అన్నారు. బహుళ రాష్ట్ర సహకార సంఘాల అభివృద్ధిని ప్రోత్సహించడం మరియు సాధ్యం చేస్తూ, కంప్యూటరీకరణ ద్వారా రంగాన్ని ఆధునీకరించడం మరియు ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు (పాక్స్) ను సాధారణ సేవ కేంద్రాలుగా ( సిఎస్సి) గా ఉపయోగించడం ఈ వారోత్సవాల లక్ష్యం. సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనీ ప్రజలకు సహకార వ్యవస్థ, స్థిరమైన జీవనోపాధి సృష్టించడమే లక్ష్యం అని అన్నారు. సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ సహకార రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిసివో సంజీవ రెడ్డి, కో ఆపరేటివ్ యూనియన్ ఎండీ అన్నపూర్ణ, డీసీసీబీ సీఈవో ఎండి వజీర్ సుల్తాన్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీపతి, కేటీసి ప్రిన్సిపాల్ యాకుబ్, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాల సభ్యులు, డీసీసీబీ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ సందర్శన కు వచ్చిన హరీష్ రావుకి బిఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం





తరంగాలు, వరంగల్ నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలెత్తుతున్న పత్తి కొనుగోలు సమస్యలు, జిన్నింగ్ మిల్లుల సమ్మె పరిస్థితులు, సిసిఐ కొనుగోళ్ల మందగింపు పై రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడటానికి వరంగల్లోని ఏనుమముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించుటకు విచ్చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకి ఘన స్వాగతం పలికిన గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు ఇన్చార్జిలు ముఖ్య నాయకులు యువజన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కామన్వెల్త్ చెస్ ఛాంపియన్ షిప్ -2025లో కాంస్య పతకం సాధించిన ముసునూరి రోహిత్ ను అభినందించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)





విజయవాడ నవంబర్ 18, తరంగాలు : మలేషియాలోని కౌలాలంపూర్ లో నవంబర్ 8 నుంచి 16 వరకు జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్ షిప్ -2025లో కాంస్య పతకం సాధించిన విజయవాడకు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబు ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. రోహిత్ లలిత్ బాబు ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ ను విజయవాడకు చెందిన ముసునూరి రోహిత్ లలిత్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. 15కి పైగా దేశాలకు పాల్గొన్న కామన్వెల్త్ చెస్ ఛాంపియన్ షిప్ -2025లో 9 రౌండ్లలో 7 పాయింట్ల సాధించి కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ కి ముసునూరి రోహిత్ లలిత్ బాబు వివరించారు. రోహిత్ లలిత్ బాబు ప్రతిభ, కృషి యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి





కుత్బుల్లాపూర్ నవంబర్ 18 తరంగాలు : నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు, అభిమానులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## 21న ఖమ్మంలో జరిగే పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా 23వ మహాసభను విజయవంతం చేయండి




ఖమ్మం నవంబర్ 18 తరంగాలు : పిడిఎస్యు ఖమ్మం జిల్లా 23వ సభలు జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు కాకి భాస్కర్, అధ్యక్షులు తాలూరి వేణు పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని నవంబర్ 21వ తారీఖున జరగబోయే పిడిఎస్యు ఖమ్మం జిల్లా 23వ సభను జయప్రదం చేయాలని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు బలమైన విప్లవోద్యమ చరిత్ర లిఖించింది. ఉస్మానియా యూనివర్సిటీలో పురుడు పోసుకుని నేడు దేశవ్యాప్తంగా విస్తరించింది. మతోన్మాద చాందస్తులకు పాలకవర్గాలకు సింహ స్వప్నమై మెరిసింది. ఇది ఏర్పడిన దగ్గర నుండి విద్యార్థి సమస్యలతో పాటు నిరుద్యోగ, మహిళ, రైతాంగ, కార్మిక, ఆదివాసీల,దళితుల సమస్యల పరిష్కారంలో ముందు భాగంలో నిలిచింది. పి డి ఎస్ యు ఎంతోమంది డాక్టర్లను టీచర్లను న్యాయవాదులను ప్రజా ఉద్యమ నాయకులను తయారుచేసింది. సమ్మర్ క్యాంపు ల ద్వారా ఆదివాసి ప్రాంతాలను పర్యటించి, సర్వేలు నిర్వహించి,వారి సమస్యల పరిష్కారం కోసం గర్జించింది. ఈ క్రమంలోనే నిత్యనిర్బంధాలను ఎదుర్కొంది. కత్తుల వంతెన పై కవాతు చేసింది కాలం పెట్టిన ప్రతి పరీక్షలో పిడిఎస్యు తన ప్రత్యేకతను చాటుకున్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల సవ్వడిలో పేరను పొందింది. ఈ క్రమంలోనే అనేకమంది విద్యార్థి రతనాలను భౌతికంగా కోల్పోయింది. ఉస్మానియా అరుణతార జార్జి రెడ్డి ప్రగతిశీల విద్యార్థి ప్రియతమ నేత కామ్రేడ్ జే సి ఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి,కోలా శంకర్, చేరాలు,రంగవల్లి,స్నేహలత, రమణయ్య,వీరారెడ్డి, మధుసూదన్ రాజ్,మారోజు వీరన్న,సాంబన్న లాంటి ఎందరో తమ రక్త తర్పణతో బిగిపిడికిలి జెండాను సమూన్నతంగా ఎత్తిపట్టారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మోడీ గత 12 ఏళ్లుగా అవలంబిస్తున్న విధానాల వల్ల దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వీటిని వ్యతిరేకించిన విద్యార్థి సంఘాలను,ప్రజలను,బిజెపి మతోన్మాద కార్పోరేట్ విధానాలకు అనుగుణంగా వీరిపై రాక్షస నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది.లేదంటే భౌతికంగా హతమారుస్తుంది తన పాసిస్టు రాజ్యాన్ని వేగవంతంగా నిర్మించే వైపు ప్రయాణిస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అవుతుంది. విద్యారంగానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. ఫీజు రియంబర్స్మెంట్ అడిగితే ముఖ్యమంత్రి అసహనం కోల్పోయి మాట్లాడుతున్న తీరు విద్యారంగానికి విఘాతం కలిగించే విధంగా ఉంది. జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు నేడు పెరుగుతున్న అసమానతలు,పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలు,ఉద్యమాల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. ఇట్లాంటి తరుణంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా 23వ మహాసభలు ఖమ్మం కేంద్రంలో నిర్వహించుకుంటున్నాం. మహాసభకు ముందు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నాం ఈ మహాసభలలో సాధించిన విజయాలు భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకొని శాస్త్రీయ విద్యా విధానంపై బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించటం కోసం సభలు జరుపుకుంటున్న%శీ%.ఈ సభలను జయప్రదం చేయవలసిందిగా అన్ని వర్గాల ప్రజానీకాన్ని విద్యార్థులను కోరుతున్నాం. అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని పిడిఎస్యు ఆహ్వాన సంఘం కోరుతుంది. ఈ కార్యక్రమంలో . ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పొట్లపల్లి విప్లవ కుమార్ కోలా లక్ష్మీనారాయణ గొర్రెపాటి రమేష్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకనపల్లి మస్తాన్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి రాము,ఖమ్మం డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్,అజయ్, భాను, జిల్లా అధ్యక్షులు ఉమాశంకర్,షబ్బీర్, నాగరాజు, సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో 50 అంతస్తుల ఐకానిక్ టవర్



విశాఖపట్నం నవంబర్ 18 తరంగాలు : మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ భారీ అభివృద్ధి ప్రాజెక్టులు ప్లాన్ చేస్తోంది. నగరాన్ని అంతర్జాతీయ స్థాయి బే సిటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. కైలాసగిరిలో 87 ఎకరాల్లో 50 అంతస్తుల 'ఐకానిక్ టవర్' నిర్మాణాన్ని ప్రకటించింది. అలాగే కొత్తవలసలో 120 ఎకరాల థీమ్ ఆధారిత టౌన్‌షిప్‌ను కూడా అభివృద్ధి చేయనుంది. మంత్రి నారాయణ ఆదేశాల మేరకు ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. కైలాసగిరి పర్వతపు దిగువ భాగంలో భారీగా జరుగనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 87 ఎకరాల్లో 50 అంతస్తుల ఐకానిక్ టవర్ నిర్మాణం ప్రధాన ఆకర్షణగా మారనుంది. ఈ టవర్ టూరిజం, రియల్‌ఎస్టేట్ మరియు కమర్షియల్ అవకాశాలను పెంచడానికి రూపొందించబడింది. ప్రకారం, ఈ ప్రాజెక్టు విశాఖను మియామీలాంటి బే సిటీగా మార్చేందుకు కీలకమైనది. టవర్‌లో లగ్జరీ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, క్లబ్‌హౌస్, జాగింగ్ & సైక్లింగ్ ట్రాక్స్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ టవర్ ప్రాజెక్టు గురించి కొంత గందరగోళం కూడా ఏర్పడింది. కొందరు దీన్ని మధురవాడలోని 4.07 ఎకరాల్లో ప్రణాళికాబడిన మరో 50 అంతస్తుల రెసిడెన్షియల్ టవర్‌తో కలిపి చూస్తున్నారు. అయితే, కైలాసగిరి ప్రాజెక్టు ప్రత్యేకంగా టూరిజం బూస్ట్‌కు దృష్టి సారించినదని స్పష్టం చేసింది. ఈ టవర్ నిర్మాణం పూర్తయితే, ఆంధ్రప్రదేశ్‌లోని అత్యున్నత రెసిడెన్షియల్ భవనాల్లో ఒకటిగా మారనుంది. ప్రాజెక్టు పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌లో అమలవుతుంది, రెండు నెలల్లోపు (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) జారీ చేస్తామని అధికారులు ప్రకటించారు. కొత్తవలస గ్రామంలో 120 ఎకరాల్లో థీమ్ ఆధారిత సిటీ, టౌన్‌షిప్ అభివృద్ధి కూడా ఈ రోజుల్లో దృష్టికి వచ్చింది. ఇది ప్రణాళికల్లో చేరిన నాలుగు థీమ్ ఆధారిత టౌన్‌షిప్‌లలో ఒకటి. మొత్తం 500 ఎకరాలకు పైగా విస్తరించిన ఈ ప్రాజెక్టులు ఐ టి & ఇన్నోవేషన్, హెల్త్ & వెల్‌నెస్, నాలెడ్జ్ & ఎడ్యుకేషన్, టూరిజం & కల్చర్, లాజిస్టిక్స్ & ట్రేడ్, ఈకో-రెసిలియెన్స్ వంటి థీమ్‌లపై ఆధారపడి రూపొందుతాయి. కొత్తవలసలోని ఈ టౌన్‌షిప్ ఐ టి & ఇన్నోవేషన్ థీమ్‌కు ప్రాధాన్యత ఇస్తుందని అంచనా. వాక్-టు-వర్క్ కల్చర్‌ను ప్రోత్సహించడం, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పర్యావరణ స్థిరత్వం, రెన్యూవబుల్ ఎనర్జీ, ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్ వంటివి ఉంటాయి. ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ.. వచ్చే ఆరు నెలల్లో పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు వివరాలను సకాలంలో ట్యాబ్ లో నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



తరంగాలు, సూర్యాపేట, నవంబర్18 : ధాన్యం కొనుగోలు వివరాలను సకాలంలో ట్యాబ్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశం మందిరంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే ఐకేపి, పిఏసిఎస్, మెప్మా, ఎఫ్‌పిఓలకు చెందిన అధికారులు, సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించిన వెంటనే బిల్లులను పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయం లో సమర్పిస్తే వేగవంతంగా రైతుల అకౌంట్ లో డబ్బులు జమ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశమునకు జిల్లా అదనపు కలెక్టర్ కే సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, డిసిఓ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# మార్కండేశ్వర దేవాలయంలో వైభవంగా శివ పంచాక్షరి యజ్ఞం



తరంగాలు, యాదాద్రి భువనగిరి, నవంబర్ 18 : సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలోని శ్రీ శివ భక్త మార్కండేశ్వర దేవాలయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా ఆలయ పూజార్లు చిట్యాల వెంకటేశం పంతులు చిట్యాల నరేష్ పంతులు ఆధ్వర్యంలో శివ పంచాక్షరి యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సూరపల్లి కుచేల్, ఉపాధ్యక్షులు చెరుపల్లి లక్ష్మయ్య, మిరియాల రాజరత్నం, ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకటేశం, కోశాధికారి ఏల నరసింహ, సహాయ కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు మకాం శ్రీనివాస్, కర్నాటి నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు మాకం యాదగిరి, దోర్నాల అంజయ్య, పున్న విజయ్ కుమార్, మకాం రామకృష్ణ, సూరపల్లి రాములు, సింగం భాస్కర్ పాల్గొన్నారు.

# ఘనంగా నశాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం






తరంగాలు / ఇబ్రహీంపట్నం, నవంబర్ 18 : నశాముక్త్ భారత్ – ఖుషాల్ భారత్ కార్యక్రమంలో భాగంగా "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి% జీవితానికి స్వాగతం చెప్పండి" అన్న సందేశంతో మంగళవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్, డిఎంఏ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురునానక్ విద్యాసంస్థల విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ ఇంధు ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, కార్తికేయ కళాశాల విద్యార్థులు భారీగా పాల్గొని ర్యాలీ నిర్వహించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యం పెంచడం లక్ష్యంగా దాదాపు ప్రధాన వీధులపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా మునిసిపాలిటీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది, పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

- సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి




తరంగాలు / ఇబ్రహీంపట్నం, నవంబర్ 18 : మొబైల్ షాప్ నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్ లో మంగళవారం ఇబ్రహీంపట్నం మొబైల్ యాక్సెసరీస్ ఎలక్ట్రానిక్స్ షాపు ఓనర్ అసోసియేషన్ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు లు హాజరై మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారంలో వ్యాపారస్తులు, వివిధ షాపుల యజమానులు ఐక్యమత్తంగా ఉండడం అవసరం అన్నారు. ఇబ్రహీంపట్నం మొబైల్ ఆక్సిసిరీస్, ఎలక్ట్రానిక్స్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం నిజంగా అభినందించదగ్గ విషయామని, మొబైల్ షాప్ సమస్యలపై పోలీసుల సహకారం ఎల్లపుడు ఉంటుందని తెలిపారు. కొందరు వ్యాపారులు ఆదాయమే ధ్యేయంగా పెట్టుకొని వినియోగదారుల నుండి సేకరించిన ఒకరి ఆధార్ కార్డు పై ఆ వ్యక్తి కి తెలియకుండా వేరొకరికి అదే ఆధార్ కార్డు లతో సిమ్ కార్డును అందిస్తున్నారని, అలా చేస్తే షాప్ యజమాని సైతం బాధ్యులు అవుతారని హెచ్చరించారు. దొంగలించిన ఫోన్లను సైతం మొబైల్ ఫోన్ షాప్స్ యజమానులు లాక్ తీయడం, మొబైల్ నుండి అమౌంట్ డ్రా చేసి ఇవ్వడం చేస్తుంటారని, ఇది చట్ట వ్యతిరేకమని అన్నారు. ఎవరైనా అపరిచితులు దొంగిలించిన ఫోన్లు వ్యాపారస్తుల వద్దకు తీసుకు వచ్చినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క షాపులో వీలైనంతవరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధ్యక్షులు నాయని మహేష్ మాట్లాడుతూ.. వినియోగదారులకు మంచి సర్వీస్ అందించడం, సరైన విధానంలో మాట్లాడడం, షాప్ ఉండే ప్రతి వస్తువు, మొబైల్ ఫోన్స్, స్పేర్ పార్ట్స్ గూర్చి ప్రతి షాప్ లో వివరించడం జరుగుతుందని, తెలిసి ఏ షాప్ ఓనర్ కూడా దొంగ ఫోన్లు కొనడం జరగదని తెలిపారు. స్పేర్ పార్ట్స్, రిపేర్ కు మొబైల్ షాప్ ఓనర్స్ అందరూ ఒకే నిర్ణీత ధర నిర్ణయించి అమ్మకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ డా. సూరమోని సత్యనారాయణ, చెరుకూరి మహేందర్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు రావుల యాదగిరి, విద్యాసాగర్ జనరల్ సెక్రెటరీ ఎండి సజద్, ట్రెజరీ రాము, అసోసియేషన్ సభ్యులు, స్థానిక వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా పాఠశాలలో వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష - ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



తరంగాలు, యాదాద్రి భువనగిరి, నవంబర్ 18 : తరగతి గదిలో విద్యార్థులు ఏకాగ్రతతో శ్రద్ధగా చదవాలంటే మెరుగైన సదుపాయాలు ఉండాలనే ఆలోచనతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పనిచేస్తున్నారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. దాంట్లో భాగంగానే మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో రూ. 1.50 కోట్ల సొంత నిధులతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు. దాంట్లో భాగంగానే మంగళవారం చౌటుప్పల్ లోని తన వ్యక్తిగత క్యాంప్ కార్యాలయంలో నారాయణపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నూతన భవనాల నిర్మాణం, నూతన బాత్రూంలు టాయిలెట్స్ నిర్మాణం, డైనింగ్ హాల్స్, వంటగది, ప్రహరీ గోడ నిర్మాణం, ఆటస్థలం ఆధునీకరణ తో పాటు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వ నుండి మంజూరై వస్తున్న నిధుల కు తోడు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున కూడా సొంత నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపూర్ కస్తూరిబా బాలికల పాఠశాల నూతన భవనాల నిర్మాణ నమూనాను అధికారులు ఎమ్మెల్యేకు చూపించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా భవనాల నిర్మాణ నమూనాలో పలు మార్పులు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ చలికాలంలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయడం చాలా కష్టంగా ఉంటుందని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడినీటి కోసం గీజర్లు ఏర్పాటు చేస్తామని వీటి తో పాటు, ఇన్వర్టర్, డైనింగ్ హాల్, టాయిలెట్స్ కి సహకారం అందిస్తామన్నారు. రాత్రి సమయంలో వసతి గృహాలలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని నారాయణపురం మండల కేంద్రంలోని కేజీబీవీ మోడల్ స్కూల్, చౌటుప్పల్ లోని కేజీబీవీ మోడల్ స్కూల్ గురుకుల పాఠశాల, చౌటుప్పల్ మండలం తూప్రాంపేటలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు విద్యుత్ సమస్య రాకుండా ప్రతి పాఠశాలకు 100 కేవీ ట్రాన్స్ఫార్మర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఫోన్లో ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, చౌటుప్పల్ ఎంఈఓ గురువారెడ్డి, డిఈ శివ కుమార్, కాంట్రాక్టర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్‌తో రైతులకు కష్టాలు

- కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఏఈకి వినతి




తరంగాలు / తుర్కపల్లి, నవంబర్ 18 : తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని జాలుబాయి కట్ట వద్ద ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోక తరచూ ఓవర్‌లోడ్ అవుతుండటంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులంతా కలిసి మండల సబ్‌స్టేషన్‌లోని (ఏఈ) బిక్షపతికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొలాలకు నీరందించేందుకు విద్యుత్తు మోటార్లను వినియోగించే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం తక్కువగా ఉండటం వలన తరచుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని వాపోయారు. దీని కారణంగా పంటల సాగుకు తీవ్ర ఆటంకం కలుగుతోందని తెలిపారు. పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సామర్థ్యం పెంచాలని, రైతులను ఆదుకునేందుకు అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరారు. జాలుబాయి కట్ట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సామర్థ్యం పెంచిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఏఈ బిక్షపతిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం - గడ్డం మల్లేష్



తరంగాలు / కుత్బుల్లాపూర్, నవంబర్ 18 : దేశాన్ని మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రక్షించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త భారత్ అభియాన్'లో భాగంగా, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం 'మాస్ ప్లెడ్జ్ అగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో పాటు, ఫిర్యాదుదారులు, ఇతర స్థానిక వ్యక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రతిజ్ఞా కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ... డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మనందరి ప్రధాన లక్ష్యమని, డ్రగ్స్ అమ్మకాలు, కొనుగోళ్లు, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, వీటికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత అధికారులకు అందించాలన్నారు. తద్వారా మన ప్రాంతాన్ని, మన దేశాన్ని డ్రగ్స్ కోరల నుంచి రక్షించడంలో మనమందరం భాగస్వాములం కావాలి అని అన్నారు.






# రాజమౌళి, మహేశ్ బాబు 'వారణాసి' టైటిల్‌పై వివాదం..

## – ఫిలిం ఛాంబర్‌లో ఫిర్యాదు




దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం టైటిల్‌పై వివాదం చెలరేగింది. ఇటీవలే 'గ్లోబ్ ట్రాటర్' పేరుతో భారీ ఈవెంట్ నిర్వహించి, ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను ప్రకటించారు. అయితే, ఈ టైటిల్ తమదేనంటూ ఓ చిన్న సినిమా నిర్మాత ఫిలిం ఛాంబర్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, సి.హెచ్. సుబ్బారెడ్డి దర్శకత్వంలో రామబ్రహ్మ హనుమ క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాకు 'వారణాసి' అనే టైటిల్‌ను తాము ముందుగానే ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని, ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయని నిర్మాత విజయ్ కె. తెలిపారు. తమ అనుమతి లేకుండా రాజమౌళి తమ టైటిల్‌ను ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నిస్తూ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఛాంబర్ జారీ చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని కూడా వారు మీడియాకు విడుదల చేశారు.

# ఐబొమ్మ రవిని ఎన్ కౌంటర్ చేయాలి

## - టాలీవుడ్ సీనియర్ నిర్మాత సంచలన వ్యాఖ్యలు



ప్రముఖ నిర్మాత, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధి సి. కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన అన్నారు. రవి అరెస్ట్ నేపథ్యంలో మంగళవారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి కఠిన చర్యలు తీసుకుంటేనే పైరసీ చేసేవారిలో భయం పుడుతుందని అభిప్రాయపడ్డారు. తాను ఎంతో కడుపు మంటతో, ఆవేదనతో ఈ మాటలు అంటున్నానని సి. కల్యాణ్ పేర్కొన్నారు. ఎంతో శ్రమించి రవిని పట్టుకున్న పోలీసు అధికారులను ఫిల్మ్ ఛాంబర్ తరఫున త్వరలోనే ఘనంగా సత్కరిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆధ్వర్యంలో నడుస్తున్న యాంటీ వీడియో పైరసీ సెల్ గురించి ఆయన గుర్తు చేసుకున్నారు. "నేను ఛాంబర్ సెక్రటరీగా ఉన్నప్పుడు యాంటీ పైరసీ సెల్‌ను ఏర్పాటు చేశాం. మన పరిశ్రమను మనమే కాపాడుకోవాలన్న బాధ్యతతో దాన్ని ప్రారంభించాం. మా కృషిని స్కాట్లాండ్ పోలీసులు సైతం గుర్తించి, కొంతకాలం నిధులు కూడా పంపించారు. గతంలో ఆస్ట్రేలియా కేంద్రంగా పైరసీ చేస్తున్న ఓ వ్యక్తిని కూడా పట్టించాం. దేశంలో యాంటీ వీడియో పైరసీ సెల్‌ను నిర్వహిస్తున్న ఏకైక సంస్థ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మాత్రమే. మధ్యలో మూసివేయాల్సిన పరిస్థితి వచ్చినా దానిని కొనసాగిస్తూనే ఉన్నాం" అని సి. కల్యాణ్ వివరించారు.

# బాలకృష్ణ 111వ చిత్రంలో హీరోయిన్ గా లేడీ సూపర్‌స్టార్..

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం '%చీదీఖ%111' నుంచి ఓ అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మంగళవారం నయనతార పుట్టినరోజును పురస్కరించుకుని ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా దర్శకుడు గోపీచంద్ మలినేని తన ఎక్స్ ఖాతాలో.. "క్వీన్ నయనతార గారికి %చీదీఖ%111 ప్రపంచంలోకి స్వాగతం. మా కథలో ఆమె శక్తి, గాంభీర్యం ఉన్నందుకు గౌరవంగా భావిస్తున్నాం. మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. మిమ్మల్ని త్వరలో సెట్‌లో కలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని పోస్ట్ చేశారు. నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ కూడా నయనతారకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది ఒక చారిత్రక



ఇతివృత్తంతో రూపొందుతుండగా, బాలకృష్ణను మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో చూపించనున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్న ఈ సినిమాను నవంబర్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ కోసం రాజస్థాన్‌లోని పలు లొకేషన్లను చిత్ర యూనిట్ పరిశీలించింది. బాలయ్య, నయన్ కాంబోలో ఇది బ్లాక్‌బస్టర్ అవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# రాజమౌళికి మద్దతుగా హైపర్ ఆది వ్యాఖ్యలు

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యల వివాదంపై నటుడు, రచయిత హైపర్ ఆది స్పందించారు. రాజమౌళికి ఆయన మద్దతుగా నిలిచారు. ఇటీవల 'ప్రేమంటే' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆది మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో సినీ ప్రముఖులపై ఇష్టానుసారంగా ట్రోల్స్ చేయడం దారుణమని అన్నారు. వారణాసి ఈవెంట్‌లో రాజమౌళి తన గ్లింప్స్ వీడియో ఆలస్యమైందని హనుమంతుడిపై అలిగారు తప్ప, ఆయన్ను అవమానించలేదని హైపర్ ఆది స్పష్టం చేశారు. భక్తి ఎక్కువైనప్పుడు దేవుడిపై అలిగే చనువు ఉంటుందని, దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దని ఆయన వివరించారు. కావాలనే కొందరు సినీ సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని ట్రోల్ చేస్తున్నారని ఆది మండిపడ్డారు. రాజమౌళి ఏ పోస్టర్ వదిలినా, అల్లు అర్జున్ నవ్వినా, చిరంజీవి, రామ్ చరణ్‌లపై .. ఇలా ప్రతీదానిపై ట్రోల్ చేయడం అలవాటుగా మారిందని, ఇది సరైన పద్ధతి కాదని హైపర్ ఆది హితవు పలికారు. కాగా, వారణాసి ఈవెంట్‌లో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. వీడియో ప్లే అవ్వడం ఆలస్యం కావడంతో ఆయన హనుమంతుడిని ఉద్దేశించి సరదాగా చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే, ఈ వివాదంపై ఇప్పటి వరకు రాజమౌళి గానీ, ఆయన చిత్ర బృందం గానీ అధికారికంగా స్పందించలేదు.

# మళ్ళీ గాయమైంది అందుకే సూపర్ హిట్ గ్యారెంటీ

## - అల్లరి నరేశ్




విలక్షణ నటుడు అల్లరి నరేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో నరేష్ మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన సెంటిమెంట్‌ను పంచుకున్నారు. 'నా సామి రంగ' సినిమా షూటింగ్‌లో తన కాలుకు గాయమైందని, అప్పుడు నిర్మాత శ్రీనివాస చిట్టూరి అది మంచి సెంటిమెంట్ అని చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఆయన చెప్పినట్లే ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిందని తెలిపారు. ఇదే సెంటిమెంట్‌ను ప్రస్తావిస్తూ, "'12ఏ రైల్వే కాలనీ' సినిమా చిత్రీకరణ సమయంలో నా భుజానికి గాయమైంది. కాబట్టి ఈ సినిమా కూడా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాను" అని నవ్వుతూ అన్నారు. తాను 64 చిత్రాల్లో నటించినప్పటికీ, సినిమా విడుదల తేదీ దగ్గరపడేకొద్దీ ఫలితం ఎలా ఉంటుందోనన్న టెన్షన్ ఇప్పటికీ ఉంటుందని నరేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నాని కాసరగడ్డపై ప్రశంసలు కురిపించారు. "నాని తన మొదటి సినిమా చేస్తున్నా ఎలాంటి టెన్షన్ లేకుండా చాలా నమ్మకంగా ఉన్నాడు. మనం చేసిన ప్రాడక్ట్ బాగుందని నమ్మినప్పుడే ఆ ధీమా వస్తుంది" అని అన్నారు. తాను తన కెరీర్‌లో ఇప్పటివరకు 35 మంది కొత్త దర్శకులతో పనిచేశానని, ఓ దర్శకుడి కొడుకుగా వారికి ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. తాను హారర్ థ్రిల్లర్ జోనర్‌లో నటించడం ఇదే మొదటిసారని, చిత్ర బృందం మొత్తం ఎంతో కష్టపడి పనిచేసిందని నరేశ్ తెలిపారు. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారని, ఇది నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుందని వెల్లడించారు.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com